ఆనందమని పింఛన్

- చురుగ్గా పెన్షన్ కానుక పంపిణీ
- జోన్–5లో 90 శాతం పూర్తి
- లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు


విమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, కన్వీనర్ రామచంద్రరావు


జోన్–5 కంచరపాలెంలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న దాసరి శామ్యూల్, వలంటీర్, కన్వీనర్


శివాజీపాలెంలో చిన్నమ్మలకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమేష్

కంచరపాలెం: ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ సొమ్ము చేతికందడంతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పెన్షన్ కానుకగా రూ.3 వేలు అందుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్–5 పరిధిలోని ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. జోన్‌లోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో శుక్రవారం వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, ఇతరత్రా పెన్షన్లను పంపిణీ చేసినట్లు జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. వలంటీర్లు వేకువజామున మంచుకురిసే వేళలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

13,399 మందికి పింఛన్ల అందజేత

ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 14,841 మంది పింఛన్‌దారులకు గానూ 13,399 మందికి పింఛన్లు అందించారు. సుమారు రూ.5.23 కోట్ల నగదు పెన్షనర్లకు విడుదలైంది. జోన్–5లో సుమారు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. సచివాలయ కార్యదర్శుల సమక్షంలో లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు అందించారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. ఇళ్ల వద్దకే కాకుండా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పింఛన్‌దారులు చికిత్స పొందుతున్న ఆస్పత్రులకు వెళ్లి వారికి పింఛన్ నగదును అందించారు. శనివారానికి 100 శాతం పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్–5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

చిరునామా కనుక్కొని వెళ్లి..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లో నివసిస్తున్న కె.చిన్నమ్మలు అనే వృద్ధురాలు వృద్ధాప్య పింఛన్ నెలనెలా అందుకుంటోంది. ఈ నెల పింఛన్ ఇవ్వడానికి వలంటీర్ రమేష్ ఆమె ఇంటికి వెళ్లగా.. అనారోగ్యం బారిన పడటంతో శివాజీపాలెంలో ఉన్న కూతురి ఇంటి వద్ద ఉందని తెలిసింది. వలంటీర్ ఫోన్ చేసి అడ్రస్ కనుక్కొని ఆమె ఇంటికి వెళ్లి చిన్నమ్మలకు పింఛన్ డబ్బులు అందజేశాడు. చిరునామా కనుక్కొని ఇంటికి వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్ రమేష్‌ను చిన్నమ్మలు, ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు. గతంలో పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగేదాన్నని, వార్డు కార్యాలయం వద్ద గంటల తరబడి పడిగాపులు కాసేదాన్నని చిన్నమ్మలు కంటతడి పెట్టుకుందని వలంటీర్ తెలిపారు. ప్రతి నెలా 1న ఇంటికి వచ్చి తలుపు తట్టి పింఛన్ డబ్బులు చేతిలో పెడుతున్న ముఖ్యమంత్రి జగన్ బాబుకు రుణపడి ఉంటానని ఆమె చెప్పిందన్నాడు.

వార్డుల వారీగా పెన్షనర్ల వివరాలు

వార్డు నం.	లబ్ధిదారుల సంఖ్య	వార్డు నం.	లబ్ధిదారుల సంఖ్య
42	849	49	1,734
43	1,549	50	653
44	1,282	51	1,033
45	839	53	815
46	1,360	54	1,072
47	1,219	55	1,192
48	1,244	—	—

జాతీయ స్థాయిలో రిషిక ప్రతిభ


రిషిక, త్యాగరాజ్‌లను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: కేంద్రీయ విద్యాలయం(వాల్తేర్) విద్యార్థిని జి.రిషిక జాతీయ స్థాయిలో విశేషంగా ప్రతిభ చూపుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో రిషికను కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్‌లో రిషిక తన ప్రతిభను చాటి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రతినిధిగా ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ఇటీవలే జరిగిన రిపబ్లిక్ డే వేడుకలు, పరీక్షా పే చర్చ కార్యక్రమాల్లో కూడా ప్రత్యేక ఆహ్వానితురాలిగా రిషిక పాల్గొని నగరానికి చేరుకుందని చెప్పారు. ఈ సందర్భంగా రిషికకు సంగీతంలో మెళకువలు నేర్పించిన కేవీ వాల్తేర్ సంగీతం అధ్యాపకుడు డాక్టర్ డి.వి.కె.జి.త్యాగరాజ్‌ను అభినందించారు.

క్లుప్తంగా

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్‌గా శ్రీరామమూర్తి



సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ మండల తహసీల్దార్‌గా జి.శ్రీరామమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయనగరం జిల్లా జియ్యం వలసలో ఆయన తహసీల్దార్‌గా పనిచేశారు. మన్యం(పార్వతీపురం) జిల్లా కలెక్టరేట్‌లోని జి.సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై సీతమ్మధార తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తిని డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

దోమల నియంత్రణపై అవగాహన


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ మలేరియా సిబ్బంది శుక్రవారం 44వ వార్డు అబిద్‌నగర్‌లో ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలు వల్ల వచ్చే వ్యాధులు, అవి పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంచారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1(ఆపరేషన్స్), ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కైలాసపురం, కస్తూరినగర్, మధుసూదన నగర్, సత్యసాయినగర్, దుర్గా కైలాష్‌నగర్, సింగాలమ్మపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జనరల్ సెక్రటరీగా నూర్ బాషా


షేక్ నూర్ బాషాకు నియామక పత్రం అందిస్తున్న జిల్లా ప్రెసిడెంట్ భారతి

తాటిచెట్లపాలెం: బీజేపీ విశాఖ జిల్లా మైనార్టీ మోర్చా జనరల్ సెక్రటరీగా ఉత్తర నియోజకవర్గానికి చెందిన షేక్ నూర్ బాషా షరీఫ్‌ను నియమిస్తూ జిల్లా మైనార్టీ మోర్చా ప్రెసిడెంట్ టి.భారతి ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని బాషాను ఆమె కోరారు. ఈ సందర్భంగా షేక్ నూర్ బాషా మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకంతో మైనార్టీ విభాగం తరఫున కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.

చోరీల కట్టడికి రాత్రి గస్తీ ముమ్మరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

మర్రిపాలెం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ ముమ్మరం చేస్తున్నామని డివిజన్ క్రైం డీసీపీ వెంకటరత్నం పేర్కొన్నారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కంచరపాలెం ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో రోడ్డు మీద పార్క్‌చేస్తున్న ద్విచక్ర వాహనాలను దొంగలు సులభంగా తాళాలు పగులకొట్టి చోరీలు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రాత్రి గస్తీ ముమ్మరం చేస్తున్నామన్నారు. దొంగతనాల దృష్ట్యా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్–100కి ఫోన్ చేయాలని డీసీపీ సూచించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో క్రైం ఏసీపీ సునీల్, ఐదో పట్టణ క్రైం సీఐ శ్రీనివాస్, క్రైం ఎస్‌ఐ సునీల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


ఫోర్త్‌టౌన్ పీఎస్ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: మద్యం తాగి వేగంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.వి.భాస్కరరావు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి 11.30 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని గురుద్వారా, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేశారు. మద్యం తాగి ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడుపుతూ పలువురు ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది సూర్యనారాయణ, రవిరాజ్ పాల్గొన్నారు.

బైక్ దొంగతనాల జోరు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగం, శరత్ థియేటర్ ప్రాంతంలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. థియేటర్ వద్ద పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు పోతుండటంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. బండిని పార్క్ చేసి లోపలకు వెళ్లి వచ్చేసరికి కనిపించకపోవడంతో తలపట్టుకుంటున్నారు. క్రైం పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో బైక్‌లు పోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు నెలల కిందట డైమండ్ పార్కు దరి సాయిరాం హోటల్ వద్ద విజయవాడకు చెందిన ఓ కుటుంబం పార్క్‌చేసిన కారు అద్దాలను పగలకొట్టి బంగారు, నగదు దొంగిలించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఒక ఇంట్లో బంగారు నగలు దొంగిలించిన ఘటనలు జరిగినా ఇప్పటి వరకు క్రైం పోలీసులు ఛేదించలేకపోయారు. రాత్రి పూట గస్తీ ఉన్నప్పటికీ దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

4న బ్రాహ్మణుల ఐక్య సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణుల ఐక్య సదస్సు నిర్వాహకులు

దాబాగార్డెన్స్: విప్రోత్సవం–2024 పేరిట ఈ నెల 4న గురజాడ కళాక్షేత్రంలో బ్రాహ్మణుల ఐక్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆహ్వాన సంఘం కన్వీనర్ పీవీ నారాయణరావు, కార్మిక సంఘం నాయకుడు వీవీ వామనరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఐక్యవేదిక సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు నగర పరిధిలో గల బ్రాహ్మణ నేతల విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద గల మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పించి, గురజాడ కళాక్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. గతంలో ఇటువంటి సదస్సు 1991లో నిర్వహించినట్టు గుర్తు చేశారు. బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక రంగాల్లో గల పరిస్థితులపై చర్చించనున్నట్టు వెల్లడించారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2 లక్షల వరకు బ్రాహ్మణ ఓట్లు ఉన్నాయన్నారు. ప్రధాన పార్టీలు బ్రాహ్మణ నేతలకు టికెట్లు ఇవ్వాలన్నారు. ఎంవీ భద్రం, భాట్టం శ్రీరామ్మూర్తి, డీవీ సుబ్బారావు వంటి బ్రాహ్మణ నేతలు సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నండూరి సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, ఆకెళ్ల రమణమూర్తి, కావూరి చరణ్‌కుమార్, బి శంకర్ నీలు, వి హనుమంతరావు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

అల్లిపురం: బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై టూ టౌన్ పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 34వ వార్డు లక్ష్మీదేవిపేటకు చెందిన బెవర వాసు అలియాస్ శేఖర్ గత నెల 30వ తేదీన అదే ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో కనుగొన్నారు. వారిని తీసుకువచ్చి బాలికను వారి కుటుంబ సభ్యులకు అప్పగించి, యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రిమాండ్‌కు ఇద్దరు..

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 17వ తేదీ రాత్రి వెలంపేట, సాలిపేటకు చెందిన సుంకరి సతీష్, పడాల నాగసాయిలు ఎల్లమ్మతోటకు చెందిన తరుణ్‌సాయిని కిడ్నాప్ చేశారు. తరుణ్‌సాయి కోసం తల్లిదండ్రులు వెదికినా ఆచూకీ లేకపోవటంతో మహారాణిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి.అప్పలనాయుడు తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను జిల్లా పరిషత్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తరుణ్‌సాయిని విడిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా ఉర్సు పండగ


ఉర్సు వేడుకల్లో పాల్గొన్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు పెద్దూరు మసీదు వద్ద మహ్మద్ అండ్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హజ్రత్ మౌలాలి బాబా ఉర్సు పండగ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మసీదులో ప్రార్థనలు చేశారు. స్థానిక ముస్లిం పెద్దలు, ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు కె.కె.రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, హబీబ్, ముస్తఫా, బషీర్, గోపి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా పూర్వ విద్యార్థులు


లవన్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నేటి తరానికి మార్గదర్శకులుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న లవన్‌కుమార్ వీసీని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ పూర్వ విద్యార్థులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా లవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో న్యాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లవన్‌కుమార్ పాల్గొన్నారు. పోటీ పరీక్షలను సన్నద్ధం కావడం, యూపీఎస్సీ పరీక్షలకు సన్నాహం, న్యాయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అంశంపై ఆయన అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో న్యాయ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలను వివరించారు. తాను ఇక్కడ విద్యార్థిగా చదువుకుని నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పని చేస్తున్న విధానం, దీనికి తాను పడ్డ శ్రమ, కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చక్కని ప్రణాళికతో పరీక్షలను సిద్ధమవుతూ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, వగీర, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల దర్శకుడు విశ్వనాథ్


కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులర్పిస్తున్న అతిథులు

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం విశ్వనాథ్ చిత్రాలు, సాహిత్యం, సమాజం అనే అంశంపై ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో గ్రంథాలయ సొసైటీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ క్రమశిక్షణ కలిగిన దర్శకుడని, విలువల కోసం కట్టుబడిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సినీ చరిత్రలో విశ్వనాథ్ ఒక యుగకర్తగా అభివర్ణించారు. నవ సాహితి ఇంటర్నేషనల్ నిర్వాహకుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విశ్వనాథ్‌తో తన అనుభవాలను వివరించారు. రాంభట్ల నృసింహశర్మ మాట్లాడుతూ విశ్వనాథ్ చిత్రాల్లోని సాహిత్యం, సాంస్కృతిక విలువలను వివరించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, చిట్టెళ్ల నిర్మల, బి.వెంకటరావు, యడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.

18 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన


చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్న కళాకారుడు

సీతంపేట: సాయిదుర్గ హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో రామటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఇటీవల ప్రారంభమైన చేనేత వస్త్రాల ప్రదర్శన ఈ నెల 18 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు కె.హరీష్, సలోమి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, జైపూర్, న్యూఢిల్లీ రాష్ట్రాల కళాకారులు రూపొందించిన వివిధ కళాత్మక వస్తువులు, వస్త్రాలను ప్రదర్శించడంతోపాటు విక్రయిస్తామన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల వారికి అవసరమైన వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. 50కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామని, ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు చేనేత, హస్తకళాకారులను ఆదరించాలని నిర్వాహకులు కోరారు.

కాలభైరవ స్వామికి విశేష పూజలు


స్వామికి వడలతో అలంకరణ


కాలభైరవ స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి శుక్రవారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. వడమాల తయారు చేసి స్వామి వారి మెడలో వేసి అలంకరించారు. భక్తులు గుమ్మడి కాయలో నెయ్యి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకుడు వంశీ, ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission. samarth. edu. in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే గతంలో ప్రకటించిన గడువు జనవరి 31తో ముగిసింది. విద్యార్థుల సౌకర్యార్థం ఇగ్నో దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

6న ఏయూలో నిక్ స్ఫూర్తిదాయక ప్రసంగం

ఏయూ క్యాంపస్: ప్రపంచాన్ని తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఆకట్టుకుంటున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఈ నెల 6న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేయనున్నారు. చిన్నతనంలో చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్.. తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉందని నిర్ణయించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా నిక్ చలించలేదు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. నిక్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి యువతకు అవకాశం కల్పిస్తామన్నారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు యోగా విభాగంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తామన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారని పేర్కొన్నారు.